క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

మణుగూరుటౌన్: సింగరేణి ఆస్తుల పరిరక్షణలో గార్డులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ కట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విశ్వాస్ యూత్ వెల్ఫేర్ 21వ వార్షికోత్సవం జీఎం కార్యాలయంలో నిర్వహించగా ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక అత్యవసరాలు తీర్చేందుకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని ఏర్పాటు చేసుకోవాలని అందుకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ అధికారిని, సొసైటీ వ్యవస్థాపకులు నాజర్‌పాషాను గార్డులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. గుర్తింపు సంఘం నాయకులు సురేందర్, కుమారస్వామి, ప్రాతినిధ్య నాయకులు జయరాజు, బాబు, కిరణ్, ఎంఎస్ రెడ్డి, ఇఫ్టూ నాయకులు మంగీలాల్, ఇన్‌స్పెక్టర్లు రాజనర్సు, జగన్ నాయక్, గార్డులు దశరథం, రాంబాబు, ప్రైవేట్ గార్డు సూపర్‌వైజర్లు రామవతార్, సుధాకర్, రబ్బాని ఉన్నారు.

ఏఎస్సైకి సన్మానం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అంకితభావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించిన వారికి పేరు ప్రతిష్టలు వస్తాయని డీఎస్పీ అబ్దుల్‌రెహమాన్ అన్నారు. మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐ అంజయ్య సన్మానోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. అంజయ్య సేవలను కొనియాడారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు చంద్రశేఖర్, గంజి స్వప్న, పోలీస్‌సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చర్ల: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చర్లలోని పూజారిగూడెంకు చెందిన పున్నం రాంప్రసాద్‌కు వైద్యఖర్చుల కోసం మేమున్నాం సహాయక కమిటీ ఆర్థిక సాయం అందజేసింది. శుక్రవారం చర్లలోని మేమున్నాం సహాయక కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు దొడ్డి తాతారావు చేతుల మీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.12 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నీలి ప్రసాద్, ప్రతినిధులు దొడ్డా ప్రభుదాసు, దొడ్డి సూరిబాబు, కవ్వాల రాము, ఇస్సారపు స్వామి, దొడ్డి రామ్మోహన్, జి.ప్రసాద్, గూడపాటి రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన కొమరం రాము అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి రాము మృతదేహానికి నివాళులర్పించారు. దహన సంస్కారాలకు మృతుని కుటుంబానికి ఇంటిలిజెన్స్ ఏఎస్ఐ కాసరబాద శ్రీనివాస్ రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

వడ్డాణాల విరాళం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయానికి దామరచర్ల గ్రామానికి చెందిన భూస్వామి సోమరాజు లక్ష్మీనర్సింహారావు, నీల దంపతులు బంగారపు వడ్డాణాలను గురువారం అందించారు. రూ.1.5 లక్షలు విలువ చేసే దీపావళి పండుగ సందర్భంగా స్వామివారి సన్నిధిలో పూజారి బోడెం వెంకన్నశాస్త్రికి అందించారు.

అన్నదానానికి..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని బాబావారి మందిరంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి గురువారం ఓ భక్తుడు విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన వేగేశ్న రవీంద్రనాథ్–రాధారుక్మిణి దంపతులు స్వామివారి అన్నదానానికి రూ.21 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, కోశాధికారి కుంచాల రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్యాగం మరులేనిది..

అశ్వారావుపేటరూరల్: ఉమ్మడి ఏపీ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేటలోగల శ్రీ పొట్టి శ్రీరాముల విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య, వాసవి క్లబ్ బాధ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసి ప్రాణ త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో శీమకుర్తి సుబ్బారావు, కొణిజర్ల ఉమామహేశ్వరరావు, తోకల హరిష్, శీమకుర్తి రవి, యశోద సత్యనాథ్ గుప్తా, జల్లిపల్లి ప్రసాద్, దూపకుంట్ల శ్రీనివాసరావు, నరేష్, ఉప్పల పవన్ కుమార్ పాల్గొన్నారు.

కొత్త క్వార్టర్లకు ప్రతిపాదనలపై హర్షం

మణుగూరుటౌన్: ఏరియా మనుగడ కోసం కొత్త గనుల అనుమతుల కోసం ప్రయత్నాలు చేస్తూనే కార్మిక సంక్షేమంపై ఏరియా జీఎం దుర్గం రాంచందర్ దృష్టి సారించడం అభినందనీయమని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఏరియాలో 240 ఎంసీ కొత్త క్వార్టర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి కార్పొరేట్‌కు అనుమతులకు పంపడం సంతోషకరమన్నారు. అదేవిధంగా ఎంసీ క్వార్టర్లలోని నివాసులకు పార్కింగ్ షెడ్‌లు ఏర్పాటు చేసే అంశంలో చొరవ చూపాలని కోరారు.

కనుల పండువగా దీపావళి

దీపావళి వేడుకలు బుధవారం కనుల పండువగా జరిగాయి. కాంతులు విరజిమ్మిన ఆలయాలల్లో ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వ్యాపార సంస్థలు, ఇళ్లను ప్రమిదలతో అంకరించి వెలుగులమయం చేశారు. లక్ష్మి పూజలు నిర్వహించారు. పిండి వంటలు, విందు భోజనాలు ఆరగించారు. పట్టణాలు, గ్రామాల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అర్ధరాత్రి వరకు టపాసుల మోతమోగింది. వేడుకల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు కుటుంబ సమేతంగా పాల్గొని సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరుటౌన్: కార్యకర్తలతో దీపావళి వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


దమ్మపేట: గండుగులపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి బాణాసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే జారే


చంద్రుగొండ: తిప్పనపల్లిలో దీపావళి సంబురాలు చేసుకుంటున్న కుటుంబ సభ్యులు


భద్రాచలంటౌన్: టపాసులు కాల్చుతున్న చిన్నారులు


కరకగూడెం: పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


అశ్వారావుపేటరూరల్: సంప్రదాయ గోగు మండలతో దీపావళి వేడుకలు..



టపాసులు కాలుస్తున్న దంపతులు, బాలిక

సమర్థవంతంగా సర్వే నిర్వహించాలి


దుమ్ముగూడెం: సీతారాంపురం ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావు

మణుగూరురూరల్: ఇంటింటి సర్వేను ఎన్యుమరేటర్లు సమర్థవంతంగా నిర్వహించాలని మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావులు సూచించారు. మండంలోని పలు ప్రాంతాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ పర్యవేక్షణలో శుక్రవారం ఎన్యుమరేటర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీ వరకు కుటుంబాల సమగ్ర సర్వేను నిర్వహించి వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు వాటిని ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్క కుటుంబం ఇంట్లోని వారి ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్, భూమి పత్రాల వంటివి అందుబాటులో ఉంచుకుని సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, సమితిసింగారం పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే..

దుమ్ముగూడెం: సమగ్ర ఇంటింటి సర్వేలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం పాల్గొని పరిశీలించారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో సర్వే అధికారులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ అశోక్‌కుమార్, ఆర్ఐలు కల్లూరి వెంకటేశ్వరావు, నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

రహదారుల అభివృద్ధికి కార్యాచరణ

బూర్గంపాడు: గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మోతె పట్టీనగర్‌లో రెండు కిలోమీటర్ల మేరా రూ 1.20 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు గ్రామాలను కలిపే రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి, డ్రెయినేజీల నిర్మాణానికి కూడా నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

అశ్వాపురం: పినపాక నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని చింతిర్యాల, చింతిర్యాలకాలనీ, నెల్లిపాక గ్రామ పంచాయతీలలో ఎమ్మెల్యే పాయం పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొండికుంట గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొమరం వీరమ్మ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన కొమరం రాము మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పాయం మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

కరకగూడెం: దీపావళి పండుగను పురస్కరించుకొని గురువారం కరకగూడెం మండలంలోని రేగళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మాధన్నగూడెం వలస ఆదివాసీలకు దోమతెరలు పంపిణీ చేశారు. 'ప్రానిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్' సభ్యుడు, కరకగూడెం గ్రామీణ వైద్యుడు షేక్ సోందుపాషా ఆధ్వర్యంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని సుమారు 80 కుటుంబాలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిస్వార్థ సేవతోనే సమాజానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యుడు సోందుపాషా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కరకగూడెం ఎస్సై రాజేందర్, ఫౌండేషన్ సభ్యులు షేక్ వసీం అక్రం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కరకగూడెం: దోమ తెరలు అందజేస్తున్న సీఐ, పక్కన ఎస్సై, ఫౌండేషన్ సభ్యులు

నంబర్ ప్లేట్లు లేకుంటే చర్యలు


పోలీస్ స్టేషన్‌కు తరలించిన నంబర్ ప్లేట్లు లేని వాహనాలు

మణుగూరురూరల్: నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని మణుగూరు సీఐ ఎస్.సతీష్‌కుమార్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సీఐ సతీష్‌కుమార్, ఎస్సైలు శుక్రవారం విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేకుండా రాకపోకలు సాగిస్తున్న 56 బైకులను, రెండు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం నెంబర్ ప్లేట్లు, ట్రాఫిక్ నియమనిబంధనలపై వాహన యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు వాహనానికి నంబర్ ప్లేట్ ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు మేడ ప్రసాద్, రంజిత్, తిరుపతి, రవూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కరకగూడెం: నేడు మండల 33/11కేవీ కరకగూడెం ఉపకేంద్రంలో 11 కేవీ భట్టుపల్లి విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు భట్టుపల్లి ఫీడర్ మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ కరకగూడెం ఏఈ నరేందర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

నేడు ఎన్ఎస్ఎస్ శిబిరం

దమ్మపేట: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) శిబిరాన్ని, నేడు మండలంలోని మల్లారం గ్రామంలో నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులు, మల్లారం గ్రామంలోని రైతు వేదికలో శిబిరంను ఏర్పాటు చేసుకుని, ఈ నెల 2 నుండి 8 వరకు అదే గ్రామంలో ఏడు రోజుల పాటు మొక్కలు నాటడం, వైద్య శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, పంటల సాగుపై అవగాహన తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరవుతారని తెలియజేశారు.

6న కంటి ఆపరేషన్లు

మణుగూరురూరల్: ఈ నెల 6వ తేదీన భద్రాచలం మారుతి నర్సింగ్ కళాశాలలో నిర్వహించే ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నేత్ర వైద్యాధికారి డాక్టర్ జి.సంజీవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారిని భద్రాచలం, అక్కడ నుంచి సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి రిఫర్ చేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారిని ఉచిత బస్సు ద్వారా తీసుకెళ్లి ఆపరేషన్ పూర్తి అయిన తర్వాత మళ్లి భద్రాచలం తీసుకు రావడం జరుగుతుందన్నారు.

గిట్టుబాటు ధర ఇవ్వండి

చంద్రుగొండ: రైతులు పండించిన పత్తిపంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయలు పెట్టుబడులు వెచ్చించి పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించని పక్షంలో ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వరికూటి వెంకట్రావ్, టి.వెంకటేశ్వర్లు, టి.భీముడు, డి.రాములు, బాలు, కిషన్, రాంబాబు పాల్గొన్నారు.

ఆ పంచాయతీలను కలపాలి

భద్రాచలంటౌన్: ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలం మండలంలో కలపాలని కోరుతూ.. జర్నలిస్ట్ నవీన్ జనసమితి పార్టీ అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని కోదండరామ్‌ను ఆయన నివాసంలో శుక్రవారం కలిసిన నవీన్.. రూట్ మ్యాప్ అందించడంతో పాటు భద్రాచలం పట్టణం ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కోదండరామ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

దుమ్ముగూడెం: హాస్టల్‌లో చదివే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ సూచించారు. శుక్రవారం లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య బాలుర, బాలికల హాస్టల్‌ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ నాయక్, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మధువరణ్‌లతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లోని వంటగది, పిల్లల డార్మెటరీస్, సిక్ రూమ్, టాయిలెట్స్‌ను, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. సిక్ రూంలో ఉన్న పిల్లలతో వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్, స్టాఫ్, ఇతర పిల్లలతో మాట్లాడారు. ప్రిన్సిపాల్స్ను ప్యూరిఫైడ్ లేదా క్లోరినేట్ చేసిన నీటిని మాత్రమే పిల్లలకు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను వివరించారు. అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఈడీడీ క్యాలెండర్, డెలివరీ రూమ్, వార్డ్స్, లేబరేటరీ, అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. డాక్టర్ పుల్లారెడ్డి, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ, అధికారులు

అరుణాచలం, పంచారామాలకు ప్రత్యేక బస్సులు

భద్రాచలంఅర్బన్/మణుగూరురూరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భద్రాచలం నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. భద్రాచలం నుంచి ఈనెల 13న రాత్రి 8 గంటలకు అరుణాచలానికి బస్సు బయలుదేరుతుందని, విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం (గోల్డెన్ టెంపుల్) చేరుతుందని వెల్లడించారు. రానుపోను పెద్దలకు రూ.3,600, చిన్నారులకు రూ.2,500 చార్జీ నిర్ణయించగా.. వివరాలకు 73823 26102, 73828 56625, 93477 97952 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఇక మణుగూరు డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం శ్యాంసుందర్ తెలిపారు. ఈనెల 3, 10, 17, 24వ తేదీల్లో అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలకు సూపర్‌లగ్జరీ బస్ బయలుదేరుతుందని, రానుపోను పెద్దలకు రూ.1,890, పిల్లలకు రూ.960గా టికెట్ ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే అన్నవరం వెళ్లే భక్తుల కోసం డీలక్స్ బస్సులు నడిపిస్తుండగా, పెద్దలకు రూ.800, పిల్లలకు రూ.430గా టికెట్ ధర నిర్ణయించామన్నారు. పూర్తి వివరాలకు 99592 25963 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

జీతాలు పెంచాలని సమ్మె నోటీస్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న ఎస్ఎల్ఎస్ మినీ హైడల్ పవర్ ప్రాజెక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, లేనిపక్షంలో నవంబర్ 15వ తేదీ తర్వాత నిరవధిక సమ్మె చేస్తామని సీఐటీయూ ఆధ్వర్యంలో పవర్ ప్లాంట్ కార్మికులు ప్రాజెక్టు యాజమాన్యానికి శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, యూటీఈయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని రమేష్‌లు మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీన ప్రాజెక్టు గేటు ఎదుట ధర్నా, 13న ప్రాజెక్టు గేటు వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తర్వాత నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ, రైతు సంఘం మండల అధ్యక్షుడు యలమంచి శ్రీనివాస్, నాయకులు సతీష్, ఎస్ఎల్ఎస్ పవర్ ప్లాంట్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు కె.ప్రకాష్, కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు నగేష్, నరేంద్ర, రాజు, సతీష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


జీతాలు పెంచాలని నోటీస్ అందజేస్తున్న నాయకులు, కార్మికులు

క్రీడా పోటీల్లో ప్రతిభ

అశ్వారావుపేటరూరల్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో అశ్వారావుపేట విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని గురుకుల పాఠశాల వద్ద వారం రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో.. 12 బీసీ గురుకులాలకు చెందిన విద్యార్థులు హాజరైయ్యారు. కాగా, అశ్వారావుపేట బీసీ గురుకులానికి చెందిన విద్యార్థులు ఏడు విభాగాల్లో (హైజంప్, లాంగ్ జంప్, 100, 200, 400 మీటర్ల పరుగు పందేల్లో) ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. ఆయా విద్యార్థులు అశోక్, నాగచైతన్య, హర్షానాయక్, రోహిత్, చరణ్‌తేజను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రేణుకా రాణి, పీఈటీ వసంత్, ఉపాధ్యాయులంతా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పోటీల్లో తమ విద్యార్థులు సత్తాచాటి, బహుమతులు గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం


అశ్వారావుపేటరూరల్: జెండా ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌డీ సలీం

సాక్షినెట్‌వర్క్: ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా మండలకేంద్రాల్లో సంఘం నాయకులు పాల్గొని, మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనేక పోరాటాలు చేసిన ఘన చరిత్ర ఏఐటీయూసీకే దక్కుతుందని ఈ సందర్భంగా వెల్లడించారు. కార్మిక హక్కుల చట్టం పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. తొలుత నాయకులు సంఘ పతాకాన్ని ఆవిష్కరించి నినాదాలు చేశారు. పలువురు ఏఐటీయూసీ సభ్యులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

భవనాలు నిర్మించాలి

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలన నిర్మించాలని కోరుతూ సీపీఎం (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. పార్టీ చర్ల, దుమ్ముగూడెం మండలాల సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ ఆధ్వర్యంలో బక్క చింతలపాడు, రామచంద్రాపురం, కిష్టారంపాడు, కురకట్‌పాడు తదితర గ్రామాలకు చెందిన ఆదివాసీలతో కలిసి వచ్చి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, ఎంఈఓ రమణకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడారు. ఏళ్ల తరబడిగా ఆదివాసీ గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు లేకపోవడంతో విద్యార్థులు పూరిగుడిసెలు, చెట్ల కింద చదువులు సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ గొంది ముయ్యన్న, ఆయా గ్రామాలకు చెందిన ఆదివాసీలు పాల్గొన్నారు.

రైతుల సత్కారం

ములకలపల్లి: టీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావును స్థానిక రైతులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. పొగళ్లపల్లికి చెందిన ఎన్నారై తాండ్ర వెంకటేశ్వరరావు ట్రస్ట్ ద్వారా సాగునీటి సరఫరాకు స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రూ.30 లక్షలను విద్యుత్‌శాఖకు డీడీ తీశారని తెలిపారు. తద్వారా పొగళ్లపల్లి, రాజుపేట, తిమ్మంపేట. తుమ్మలకుంట గ్రామాలకు సాగు నీరందించారని ఆయా ప్రాంతాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ కొదుమూరి పుల్లారావు, రాంబాబు, కొమ్మురాజు శ్రీను, వెంకన్న, సత్యం తదితరులు ఉన్నారు.

త్యాగాలను స్మరించుకోవాలి

అశ్వారావుపేటరూరల్: భూమి, భుక్తి, ముక్తి కోసం ప్రాణ త్యాగాలను చేసిన అమరవీరులను స్మరించుకోవాలని సీపీఐ మాస్‌లైన్–ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నందిపాడు గ్రామంలో అమరవీరు వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించి, అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామిలను తక్షణమే అమలు చేయాలని, పోడు భూములకు పట్టా పుస్తకాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధర్ముల శ్రీరాములు, వాసం బుచ్చిరాజు, పండా ముత్యాలు, కుంజా అర్జున్, కారం మల్లేష్, కాకా బాబు, ధర్ముల రాంబాబు, జెడ్డి నారాయణ, కొర్రి రాజు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ములకలపల్లి: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మునగ సాగు, మొక్కజొన్న పంట సాగుపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణ్‌బాబు మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులు మునగ సాగు పట్ల దృష్టి సారించాలని తెలిపారు. మునగ సాగులో లాభాలను సవివరంగా విశదపరిచారు. మండలపరిధిలోని జగన్నాథపురం పరిసరాల్లో విస్తారంగా మొక్కజొన్న సేద్యం చేస్తున్న నేపథ్యంలో.. తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారి రమేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ వర్ధంతి


దమ్మపేట: ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షినెట్‌వర్క్: దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిర్వహించారు. ఇందిరా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. ఇందిరా ఉక్కు మహిళ అని అభివర్ణించారు.